క్లుప్తంగా

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

పర్చూరు: స్థానిక నాంచారమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లా పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వస్తున్నారని తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు, ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

6వ తేదీ నుంచి వారబందీ

అద్దంకి: నాగార్జున సాగర్ కుడి కాలవకు కేటాయించిన నీటికి ఈనెల 6వ తేదీ నుంచి వారబందీ విధానం అమలుచేయనుననట్లు సంతమాగులూరు డీఈ ఈశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాని ప్రకారం ఆరో తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆరు రోజులు కాలువకు నీటి సరఫరా నిలిపేస్తారు. 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కాలువకు తిరిగి నీటి సరఫరా చేస్తారని తెలిపారు. రైతులు గమనించి నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం పునర్వసు నక్షత్రం ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

విద్యుత్ పనులు పూర్తి

గుడ్లూరు: మండలంలోని తెట్టు–రామాయపట్నం గ్రామాల మధ్య రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు నిర్మిస్తున్న ఆర్‌ఆర్ కాలనీలో విద్యుత్ పనులు పూర్తయినట్లు విద్యుత్ శాఖ డీఈఈ విజయబాబు అన్నారు. ఆర్‌ఆర్ కాలనీలో విద్యుత్ పోల్ నిర్మాణాల పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణంతో నిర్వాసితులైన మొండివారిపాలెం గ్రామస్తులకు ఆర్‌ఆర్ కాలనీలో వారు నిర్మించుకుంటున్న గృహాలకు విద్యుత్ సరఫరా అందించామన్నారు. అలాగే మరో నిర్వాసిత గ్రామం ఆవులవారిపాలెం గ్రామస్తులు కూడా త్వరలో ఆర్‌ఆర్ కాలనీలో గృహనిర్మాణాలు చేపడుతున్నందున వారికి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అక్కడ 70 పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు లాగి బల్బులు అమర్చామన్నారు. దీంతో రెండు కాలనీలలో విద్యుత్ పనులు పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని త్వరలో, మరో నాలుగు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

స్పీకర్లకు అనుమతి తప్పనిసరి

మద్రిపూడి: ఈ నెల 6న జరగనున్న శ్రీ పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్లలో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని కొండపి సీఐ ఎం. శ్రీనివాసరావు అన్నారు. మద్రిపూడి నుంచి పృధులగిరి కొండకు వెళ్లే రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ తిరునాళ్లలో అసాంఘిక కార్యక్రమాలకు చోటులేదన్నారు. లౌడ్ స్పీకర్ల పర్మిషన్ కోసం అనుమతి తీసుకోవాలన్నారు.

సేవల ద్వారా ఆదాయం పెంచండి

జరుగుమల్లి (సింగరాయకొండ): గ్రామ పంచాయతీల్లో ఇచ్చిన లక్ష్యాల ప్రకారం సేవల ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచి ప్రభుత్వానికి సహకరించాలని ఎంపీడీఓ పి. రామకృష్ణ గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయాన్ని గురువారం తనిఖీ చేసి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కార్యదర్శి పి. అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

గడప నిధులు.. తీరిన వెతలు



వేమవరం గ్రామంలో నిర్మించిన కల్వర్టు



భగవాన్ రాజుపాలెంలో నిర్మిస్తున్న సైడు కాలువ, కల్వర్టు

- గడప గడప నిధులతో వార్డులు, గ్రామాల్లో అభివృద్ధి
- నియోజకవర్గంలో రూ.5.2 కోట్లతో పనులు
- తుదిదశకు చేరిన పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బల్లికురవ: ప్రభుత్వం మాట ఇచ్చిందంటే అది కచ్చితంగా నెరవేర్చినట్లే. ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వాలు గాలికొదిలేసిన పనులను సైతం పూర్తిచేయడానికి కంకణం కట్టుకుందంటే ఆశ్చర్యం వేయకమానదు. ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టింది. పది నెలలుగా ఆయా నియోజకవర్గాల మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రతి గడపకు వెళ్తున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి పార్టీలకు అతీతంగా ఇంట్లో ఎంత మేర లబ్ధిపొందారో తెలియజేస్తున్నారు. అంతే కాదు పథకాలు అందనివారికి ఎందుకు అందలేదో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల అడిగి తెలుసుకుని పరిష్కారం చేస్తున్నారు.. ప్రతి గడపకు పథకాల వర్తింపుతో ప్రజా ప్రతినిధులు అధికారులకు గ్రామాల్లోని ప్రజలు ఘన స్వాగతంతో బ్రహ్మరథం పలుకుతున్నారు. పర్యటనలో భాగంగా స్థానికులు చెప్పిన సమస్యలను గుర్తుంచుకొని ఆయా సచివాలయ నిధులతో పనులు చేయడానికి పూనుకున్నారు.

రూ.5.2 కోట్ల మేర అభివృద్ధి పనులు..

రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య నియోజకవర్గంలోని బల్లికురవ మండలంలో నాలుగు సచివాలయాలు, జే పంగులూరు మండలంలో నాలుగు సచివాలయాలు, కొరిశపాడు మండలంలో మూడు సచివాలయాలు, అద్దంకి మండలంలో నాలుగు సచివాలయాలు, మున్సిపాలిటీలో 20 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్న తీరు సచివాలయ, వలంటీర్ల తీరు తెలుసుకుంటున్నారు. ఆయా సచివాలయాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అద్దంకి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసులు, ఏఈలు గిరినాయక్, శివయ్య, వసుధ, పర్యవేక్షణలో పనులు నాణ్యత ప్రమాణాలతో జరుగుతున్నాయి. ఎక్కువగా డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి, కల్వర్టులు తదితర సమస్యలను గుర్తించారు. బల్లికురవ మండలంలోని వేమవరం, కొప్పరపాడు, కొత్తూరు, ఎస్ఎల్‌గుడిపాడు, సంతమాగులూరు మండలంలోని మావిళ్లపల్లి, తంగేడుమల్లి, కొప్పరం, చవిటిపాలెం, జే పంగులూరు మండలంలోని చందలూరు, కొప్పరపాడు, తూర్పు కొప్పరపాడు, బైటమంజులూరు, కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం, మేదరమెట్ల–3, రాచపూడి, అద్దంకి మండలంలోని ధర్మవరం, చక్రాయపాలెం, నాగులపాడు, గోవాడ సచివాలయాలకు రూ.3.6 కోట్లు, అద్దంకి మున్సిపాలిటీకి రూ.1.6 కోట్లు మంజూరయ్యాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమస్యలు తెలుసకుంటున్న చైతన్య (ఫైల్)

మండలం	మంజూరైన నిధులు
అద్దంకి మున్సిపాలిటీ	రూ.1.60 కోట్లు
అద్దంకి	రూ.80 లక్షలు
బల్లికురవ	రూ.80 లక్షలు
సంతమాగులూరు	రూ.80 లక్షలు
జే పంగులూరు	రూ.80 లక్షలు
కొరిశపాడు	రూ.60 లక్షలు

65 శాతం మేర పనులు పూర్తి..



గ్రామ, వార్డు సచివాలయాలకు మంజూరైన నిధులతో సీసీ డ్రైనులు, సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మాణం 65 శాతం మేర పూర్తి చేశాం. పనులు పూర్తికాగానే ఎం రికార్డు కూడా పూర్తి చేస్తున్నాం. ఎక్కడా బిల్లుల మంజూరులో జాప్యం లేదు.

ఏ. శ్రీనివాసులు ఆర్‌డబ్ల్యూఎస్, డీఈ, అద్దంకి

కాలనీల్లో సైడ్ కాలువలు నిర్మించారు..



గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కాలనీలో రూ.20 లక్షలతో సైడు కాలువల నిర్మాణం చేపట్టారు. ఎప్పటి నుంచో ఈసమస్య ఉంది. గత ప్రభుత్వంలో చెప్పినా పట్టించుకోలేదు. ఈప్రభుత్వంలో మా ఇబ్బందులు తీరాయి.

అంజయ్య, కొప్పరపాడు

సైడు కాలువల నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు..



మా గ్రామానికి సైడు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాలువల నిర్మాణం చేయడంతో ఇబ్బందులు తొలగాయి. శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్యకు అభినందనలు.

పీ.జ్యోతి భాస్కరరాజు, బైటమంజులూరు

ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం

- ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: ఉగాది నాటికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు జరగాలని అధికారులకు ఎమ్మెల్యే కరణం బలరాం సూచించారు. గురువారం ఆయన చీరాల నగర్‌లోని లే అవుట్ 1, 2లలో నిర్మిస్తున్న కాలనీలను ఎమ్మెల్యే పరిశీలించారు. హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలతో ఆయన చర్చించారు. పలు కారణాల వలన ఇప్పటికే అలస్యంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఉగాదిలో లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి గృహప్రవేశాలు జరిపించాలని నిర్ణయించిందన్నారు. ఇంకా ఇళ్లు నిర్మించని వారిని గుర్తించి వారికి అవసరమైన ఆర్థికసాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇళ్లు పూర్తికావాలంటే లబ్ధిదారులు దగ్గర ఉండి పనులు త్వరగా చేయించుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యల పరిష్కారం



హద్దు రాళ్లను నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

మార్టూరు: జగనన్న భూ రక్ష, భూహక్కు పథకాలతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రైతాంగ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని బాపట్ల ఆర్డీవో జీ రవీందర్ అన్నారు. మండలంలోని కోలలపూడి గ్రామంలో భూముల సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన స్థానిక రైతులు, అధికారులతో మాట్లాడుతూ వందేళ్ల క్రితం బ్రిటీష్ పాలనలో జరిగిన భూముల సర్వే అనంతరం దేశంలోనే రాష్ట్రంలోనే మొదటి సారిగా రీసర్వే జరగటం చారిత్రాత్మకమన్నారు. కోలలపూడి గ్రామంలో 3547 ఎకరాల భూమి రీసర్వే పూర్తి చేశామని, 1817 మంది రైతులకు గాను 1317 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. రీ సర్వే అనంతరం సర్వే సిబ్బంది ఏర్పాటు చేసే సరిహద్దు రాళ్ల ప్రామాణికమని, అధికారులకు తెలియకుండా ఎవరైనా రాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక సంపత్ నగర్ కాలనీలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరెడ్డి, ఆర్ఐ బాషా, సర్వేయర్ ఏడుకొండలు, సర్వే డీటీ ప్రహర్ష, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

దానావలి కుటుంబానికి చైతన్య పరామర్శ



దానావలి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న చైతన్య

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి మృతి చెందిన మునిసిపల్ బిల్ కలెక్టర్ దానవలి భౌతిక కాయాన్ని గురువారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు. అదే విధంగా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూనూరి నరేంద్ర సోదరుడు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



అలంకరణలో వెంకటేశ్వరస్వామివారు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన అలివేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం ఆలయ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆద్వర్యంలో విఘ్నేశ్వర పూజ, కంకణాల పూజల అనంతరం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని 44 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ సహకారంతో ప్రత్యేక పూజల తరువాత తీర్థ, ప్రసాదాలు, ఆలయ కమిటీ సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీటీసీ ఓటర్ల జాబితా ప్రకటన



జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

అద్దంకి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని సంతమాగులూరు–2 ఎంపీటీసీ పదవికి ఆకస్మికంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేయుటకు నిర్వహించాల్సిన ఎన్నికల కోసం, ఓటర్ల జాబితా ప్రకటించినట్లు ఎంపీడీవో సాంబశివరావు గురువారం చెప్పారు. జాబితాను సంబంధిత పోలింగ్ స్టేషన్ అయిన ప్రభుత్వ హైస్కూలు, మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డు, మండల తహసీల్దారు కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించామని చెప్పారు.

పేద విద్యార్థులకు ప్రభుత్వం అండ



ట్యాబ్‌లతో విద్యార్థులు, ప్రత్యేక అధికారి రామారావు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కొండంత అండగా ఉందని జిల్లా సహకారశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా రాని మార్పు ఈరోజు నాడు–నేడు పేరుతో వచ్చిందన్నారు. పాఠశాలల అభివృద్ధితో పాటు, పేద విద్యార్థి చేతిలో ఒక ట్యాబ్ సహకారంతో ఉన్నత, కార్పొరేట్‌స్థాయి విద్యను బీజం వేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లు వారికి ఏవిధంగా ఉపయోగకరంగా ఉన్నాయో దగ్గరుండి గమనించారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్మాణంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ నిర్మాణ పనులను పరిశీలించి వేగంగా పూర్తి చెయ్యాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారికి అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చెంచుపున్నయ్య, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో పారదర్శకంగా సేవలు



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీపీఆర్‌వో

అద్దంకి: సచివాలయాల్లో పారదర్శకంగా సేవలు అందించాలని డీపీఆర్‌వో మోహన్‌రాజు అన్నారు. ఆయన గురువారం పట్టణంలోని ఒకటో నంబర్ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఆర్‌వో మాట్లాడుతూ సచివాలయ అధికారులు పౌరులకు అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలపై వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న వైద్యాధికారి విజయభాస్కర్

చినగంజాం: మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజాం అభివృద్ధి చెందుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ అన్నారు. కస్తూరిబా బాలికా విద్యాలయంలో ఆయన అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలను చిన్న చూపు చూడకూడదని, పురుషులతో సమానంగా అన్నింటా వారికి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ హరిప్రసాద్ పాటల రూపంలో సామాజిక అభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై వినిపించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు పీవీ సుబ్బారావు, అంగన్ వాడీ సూపర్ వైజర్‌లుసబిత, శేషమ్మ, కేజీబీవీ ప్రత్యేకాధికారి సుమాంజలి, ఉపకేంద్ర సీహెచ్‌ఓ రమాదేవి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యాలతో మంచి అవకాశాలు



మాట్లాడుతున్న మంజునాథ్

వేటపాలెం: ఇంజినీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ కెరీర్ డెవలపర్ కే మంజునాథ్ సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కెరీర్ డెవలప్‌మెంట్‌పై మోటివేషనల్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. నేటి విద్యార్థులు ఒత్తిడిలేని జీవన విధానాన్ని అలవరచుకోవాలన్నారు. జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవటానికి మనస్సును నియంత్రణలో ఉంచుకోవటానికి ధ్యానం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం

చీరాల: స్థానిక గోలిసదాశివరావు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లా పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి సమీక్ష సమావేశం జరుగుందని తెలిపారు. సమావేశానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశానికి ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే కరణం బలరాం, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు హనుమంతరావులు హాజరుకానున్నట్లు ప్రకటనలో తెలిపారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు



రామకృష్ణాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

మేదరమెట్ల: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో ఆయన గురువారం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయానికి విధుల్లోకి వచ్చి హాజరు వేయాలన్నారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా పలు రికార్డులు ఎంపీడీవో పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

చీరాల టౌన్: గ్రామ, వార్డు సచివాలయల్లో విదులు నిర్వహించే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని తహసీల్దారు ప్రభాకరరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని రామకృష్ణాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చీరాల అర్బన్: కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం దేశ సంపదను దోచిపెడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరగగొట్టే విధంగా గ్యాస్ ధరలను పెంచిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలందరూ బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బీ శ్రీనివాసరావు అన్నారు. కేంద్రం గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గ్యాస్ ధరలను నియంత్రిస్తామని చెప్పి ప్రజల ఓట్లతో గెలిచిన గెలిచి సబ్సిడీతో గ్యాస్ అందిస్తామని చెప్పి నేడు గ్యాస్ ధరలను పెంచారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు చిరు దుకాణదారులు ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇది కమ్యూనిస్టులు, ప్రతిపక్షాల సమస్య కాదని, దేశ ప్రజల ఉమ్మడి సమస్య గనుక ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు ధనలక్ష్మి, బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, కమిటీ సభ్యులు మణిలాల్, కృష్ణమోహన్, కె.సురేష్, కిరణ్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.